క్లుప్తంగా

ఆయిల్‌పామ్‌తో లాభాలు



రైతులకు సూచనలు చేస్తున్న బాలాజీ నాయక్

నంగునూరు(సిద్దిపేట): ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు గడించవచ్చని ఉద్యానవన శాఖ అధికారి బాలాజీ నాయక్ అన్నారు. సిద్ధన్నపేటలో రైతులు సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ పంటను మంగళవారం ఆయన పరిశీలించారు. మొక్కల సస్యరక్షణ చర్యలు, పాదులు తీయడం, డ్రిప్ ద్వారా నీటి వినియోగం, కలుపు తీసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం బాలాజీ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీపై మొక్కలు, డ్రిప్ అందించడంతో పాటు మొక్కల సంరక్షణ కోసం డబ్బులు అందజేస్తోందన్నారు. ప్రభుత్వం అందించే సబ్సిడీలను ప్రతీ రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీటీసీ బెదురు తిరుపతి, ఏఈఓలు సాయివర్మ, నితీశ్, సత్తిరెడ్డి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

వరి పంటపై జాగ్రత్త వహించాలి



వరి పంటను పరిశీలిస్తున్న ఏఈవో శివకుమార్

కోహెడరూరల్(హుస్నాబాద్): యాసంగి వరి పంటపై ప్రతీ రైతు తగు జాగ్రత్తలు వహించాలని ఏఈవో శివకుమార్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని ఎర్రకుంటపల్లి గ్రామంలో వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు వేసిన వారం రోజుల్లో కాండం తొలుచు పురుగు, రెక్కల పురుగు ఎక్కువగా ఉంటుందని రైతులు గమనించాలన్నారు. వాటి నివారణకు 15 రోజుల వయస్సు ఉన్న వరి పైరుల్లో తప్పకుండా కార్బోఫ్యూరాన్, కార్టాప్ హైడ్రోక్లోరైడ్‌లను నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు.

జీవన ఎరువులపై క్షేత్ర ప్రదర్శన

తొగుట(దుబ్బాక): పంట సాగులో రైతులు ఖర్చులు తగ్గించుకోవాలని ఏవో మోహన్ రైతులకు సూచించారు. మండలంలోని రాంపురంలో క్షేత్ర ప్రదర్శన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్వరాన్ని కరిగించే జీవన ఎరువుపై రైతులకు సూచనలు, సలహాలు అందించారు. 50కిలోలు బాగా మాగిన పశువుల ఎరువు, ఒక లీటర్ జీవన ఎరువు కలిపి చల్లుకోవాలని సూచించారు. భాస్వర అందించే ఎరువు 20-20-0 లేదా డీఏపీ ఎరువు వాడకుండా ఖర్చు తగ్గించుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఈవో రాజేష్, రైతులు కనకరాజు, నర్సింలు, మల్లేశం పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీ మండల కమిటీ ఎన్నిక

హుస్నాబాద్: వైఎస్సార్‌టీపీ మండల, పట్టణ నూతన కమిటీలను మంగళవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మేదిని రామలింగారెడ్డి, నియోజకవర్గ నాయకుడు అయిలేని మల్లికార్జున్‌రెడ్డిలు నియమించారు. హుస్నాబాద్ మండల అధ్యక్షుడిగా గడ్డి అశోక్, కార్యదర్శులుగా జానకి రాంరెడ్డి, గడ్డి రవి, సహాయ కార్యదర్శిగా ఎర్రవెల్లి రాజయ్య, సోషల్ మీడియా మండల ఇన్‌చార్జి గట్టు శివ, హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడిగా రమేశ్, ప్రధాని కార్యదర్శిగా రామ్, ఉపాధ్యక్షులుగా భాస్కర్‌రెడ్డి, రాజు, కార్యదర్శిగా మల్లేశం, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌లను నియమించారు. అలాగే యూత్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సాయికృష్ణ, ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సంతోష్‌నాయక్‌లను నియమించారు.

కళాశాలల్లో రీసెర్చ్ కార్యక్రమాలు అభినందనీయం



హైదరాబాద్‌లో పుస్తకావిష్కరణలో కళాశాల విద్యా కమిషనర్ నవీన్‌మిట్టల్, తదితరులు

సిద్దిపేటఎడ్యుకేషన్: డిగ్రీ కళాశాలలో రిసెర్చ్ ఆక్టివిటీస్ జరగడం అభినందనీయమని కళాశాల విద్యా కమిషనర్, ఐఏఎస్ అధికారి నవీన్‌మిట్టల్ పేర్కొన్నారు. సిద్దిపేట డిగ్రీ కళాశాల చరిత్ర విభాగాధిపతి డాక్టర్ కలిపాక శ్రీనివాస్ సంకలనం చేసిన ఉమెన్ ఇన్ కంటెంపరరీ సొసైటీ-ఏహిస్టారికల్ ప్రాస్పెక్టివ్ అనే పుస్తకాన్ని మంగళవారం జాయింట్ డైరెక్టర్ యాదగిరి, స్టేట్ అకాడమీ గైడెన్స్ అధికారి తిరువెంగలాచారి, ప్రిన్సిపాల్ ప్రసాద్‌లు హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తకరచన చేసిన శ్రీనివాస్‌ను అభినందించారు.

అక్కన్నపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా మల్లారెడ్డి

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడిగా చింతల మల్లారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య, గ్రామ సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డి అధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ యూత్ మండల అధ్యక్షుడు పాంద్రాల దాము తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పథకాలను కాపీకొడుతున్న కేంద్రం

- కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రం ముందుకు..
- దూల్మిట్ట మండల అభివృద్ధికి కృషి చేస్తా
- ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

మద్దూరు(హుస్నాబాద్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను కేంద్ర ప్రభుత్వం కాపీ కొట్టి ఇతర రాష్ట్రంలో అమలు చేస్తోందని ఆర్థిక, వైద్యారోగ్య మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం దూల్మిట్ట మండల కేంద్రంలో రూ.50లక్షలతో సీసీరోడ్డు, 10లక్షలతో పద్మశాలీ భవనం, 10లక్షలతో అంగన్‌వాడీ భవనం, 10లక్షలతో రెడ్డి కమ్యూనిటీ భవనం, 10లక్షలతో ఓపెన్ నాలా పనులను మంత్రి ఎర్రబెల్లి దయాకర్, జనగామ ఎమ్మెల్యేతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో చైతన్యవంతంగా పాల్గొని కేసీఆర్‌కు పూర్తిగా మద్దతు ఇచ్చిన దూల్మిట్ట మండలాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. రూ.1కోటి 10లక్షలతో గ్రామంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామన్నారు. 'మన ఊరు–మన బడి' కార్యక్రమం ద్వారా రూ.70లక్షలు మంజూరు చేశామన్నారు. అదే విధంగా గ్రామంలో వైద్యం, విద్యకు పూర్తిగా సహకరిస్తామన్నారు. మన రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్ర సర్పంచ్‌లు తెలంగాణలో కలపాలని కోరుతున్నారని తెలిపారు. 950 మంది డాక్టర్లను నూతనంగా నియమించామన్నారు. నేడు చేర్యాల ప్రాంతంలో నూతనంగా 11 కోట్లతో ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. అలాగే జనగామ జిల్లాలో 600 పడకలతో ఆస్పత్రి, మెడికల్ కాలేజీని నిర్మిస్తామన్నారు.

చేర్యాల ప్రాంతంతో ప్రత్యేక అనుబంధం: మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని చేర్యాల, మద్దూరు, దూల్మిట్ట, కొమురవెల్లి ప్రాంతాలతో తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. కేసీఆర్ పట్టుబట్టి ఈ చేర్యాల ప్రాంతాన్ని సిద్దిపేట జిల్లాలో కలిపి అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్ పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ఆదుకుంటున్నారన్నారు. దూల్మిట్ట మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, రావుల శ్రీధర్‌రెడ్డి, ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మంద యాదగిరి, మేక సంతోష్‌కుమార్, సర్పంచ్ దుబ్బుడు దీపిక వేణుగోపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

30పడకల ఆస్పత్రి నిర్మాణానికి భూమిపూజ

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో మంగళవారం మంత్రి హరీశ్‌రావు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్థానిక ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక బీడీ కాలనీ సమీపంలో రూ. 9కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 30 పడకల ఆస్పత్రి భవనానికి శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక వేణుగోపాలస్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి తనవంతుగా సహకరిస్తానని హామీ ఇచ్చినట్లు ఆలయ ప్రధాన అర్చకులు శేషాచార్యులు, మూర్తి, రాజుస్వామిలు తెలిపారు. అంతకుముందు ఇటీవల హత్య చేయబడిన చేర్యాల జెడ్పీటీసీ సభ్యుడు శెట్టె మల్లేశం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చిన మంత్రి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీనిచ్చారు.



ఆస్పత్రి భవనానికి భూమిపూజ చేస్తున్న మంత్రులు

ఘన స్వాగతం..

ఆస్పత్రి భవన నిర్మాణ పనులను ప్రారంభించేందుకు వస్తున్న మంత్రి హరీశ్‌రావుకు మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌కుమార్ ఆధ్వర్యంలో యువకులు భారీ బైక్ ర్యాలీతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి, ఎంపీపీలు ఉల్లంపల్లి కరుణాకర్, బద్దిపడిగ కృష్ణారెడ్డి, మార్కెట్ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు మంగోలు చంటి, పచ్చిమడ్ల సతీష్, మార్కెట్ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, నాయకులు బాల్‌నర్సయ్య, పర్వతాలు, అంజయ్య, సాయికిరణ్, భిక్షపతి పాల్గొన్నారు.

మౌలిక వసతులకు నిధులు మంజూరు



నిధుల మంజూరుపత్రాన్ని అందజేస్తున్న మంత్రి

దుబ్బాకరూరల్: మండలంలోని హబ్సీపూర్‌లో గల మహాత్మాజ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడానికి రాష్ట్ర వైద్యారోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు రూ.50లక్షలు నిధులు మంజూరు చేశారు. నిధుల మంజూరు పత్రాన్ని మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిలతో కలిసి స్థానిక ఎంపీపీ కొత్త పుష్పలత, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డిలకు అందజేశారు. పాఠశాల ఆరవణలో ఆరు తరగతి గదులు, డైనింగ్ హాల్, టాయిలెట్లను నూతనంగా నిర్మిస్తారని తెలిపారు. నిధులు మంజూరు చేసిన మంత్రికి, అందుకు కృషి చేసిన ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శేర్ల కైలాశ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగు



మాట్లాడుతున్న మాజీ ప్రభుత్వ విప్ ఆరెపల్లె మోహన్

బెజ్జంకి(సిద్దిపేట): క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగుపడతాయని మాజీ ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ నాయకుడు ఆరెపల్లె మోహన్ పేర్కొన్నారు. బెజ్జంకి యూత్ ఆధ్వర్యంలో బెజ్జంకిలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ఆయనతో పాటు బెజ్జంకి సర్పంచ్ ద్యావనపెల్లి మంజుల, కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు కవ్వంపెల్లి సత్యనారాయణ, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం నాగరాజులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బెజ్జంకిలో యువకులు సమష్టిగా కృషి చేసి క్రికెట్ టోర్నమెంట్‌ను కొనసాగించడాన్ని అభినందించారు. అనంతరం టాస్ వేసి బ్యాటింగ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్‌పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిశాని రామచంద్రం, మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్, బెజ్జంకి సర్పంచ్ ద్యావనపెల్లి మంజుల, వివిధ పార్టీల నాయకులు, నిర్వాహకులు మహేందర్, రూపేష్, శ్రీనివాస్, కుమార్, మానాల రవి, డీవీరావు, మధు, తదితరులు పాల్గొన్నారు.


వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సరోజనమ్మ

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని వెలికట్టలో రిటైర్డు టీచర్ కీర్తిశేషులు గూడ మల్లారెడ్డి స్మారకార్థం 10 నుంచి 14వ తేదీ వరకు జరిగే మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను మంగళవారం భార్య సరోజనమ్మ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సరోజనమ్మ మాట్లాడుతూ.. మృతుడు మల్లారెడ్డి ఉపాధ్యాయుడిగా పని చేసిన రోజుల్లో ఆటలపై ఎంతో ఆసక్తిని చూపేవారని, ఆయన ఆశయ సాధనకు వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. టోర్నమెంట్‌కు మండల వ్యాప్తంగా 25 జట్లు నమోదు చేసుకోగా మరో 13 జట్లు ఆన్‌లైన్లో నమోదు చేసుకోవడం మూలంగా రిజిస్ట్రేషన్ కాలేదన్నారు. వీరి కోసం 13వ తేదీ ఉదయం 9 గంటల వరకు గడువునిస్తున్నామన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న టీమ్‌లు మాత్రమే టోర్నమెంట్‌లో పాల్గొంటాయన్నారు. టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన జట్లకు ఆఖరు రోజు 14వ తేదీన మొదటి బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అమ్ముల రమేశ్, రెడ్డి జేఏసీ రాష్ట్ర కార్యదర్శి గూడ మహేందర్‌రెడ్డి, పీఈటీల సంఘం జిల్లా అధ్యక్షులు తోట సతీష్‌కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన మండల ప్రజాప్రతినిధులు



ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డితో స్థానిక ప్రజాప్రతినిధులు

మిరుదొడ్డి(దుబ్బాక): పార్టీలో ఉన్న సమన్వయ లోపాన్ని సరిదిద్ది గ్రామాల అభివృద్ధికి పాటు పడతానని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు బీఆర్ఎస్ పార్టీలోనే ఉంటామని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు తెలిపారు. తమ గ్రామాలపై వివక్ష చూపుతూ ఉమ్మడి మండల పరిధిలోని భూంపల్లి గ్రామానికి రూ.50లక్షల నిధులను కేటాయించడంపై నిరసన వ్యక్తం చేస్తూ మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్‌కు సహాయ నిరాకరణను ప్రకటించిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ సందర్భంగా మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌కు సహాయ నిరాకరణ విషయంపై మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఉమ్మడి మండల ప్రజాప్రతినిధులతో కలిసి సిద్దిపేటలో మంగళవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతీ గ్రామానికి వివక్ష లేకుండా గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తానని ఎంపీ ప్రభాకర్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. భూంపల్లి గ్రామానికి కేటాయించిన రూ.50లక్షల నిధులను వెనక్కి తీసుకొని ప్రతీ గ్రామానికి సమాన నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీ వెల్లడించినట్లు తెలిపారు. కాగా ఎంపీ ఇచ్చిన హామీ మేరకు బీఆర్ఆర్ఎస్‌కు సహాయ నిరాకరణను ఉపసంహరించుకొని పార్టీలోనే కొనసాగుతూ అధికారిక కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొంటారని స్పష్టం చేశారు. ఎంపీని కలిసిన వారిలో ఎంపీపీ సాయిలు, జెడ్పీటీసీ లక్ష్మీలింగం, దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ భాస్కరాచారి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు బాలమల్లేశంగౌడ్, మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, వైస్ చైర్మన్ చందాపురం మల్లేశం, కో–ఆప్షన్ మెంబర్ ఎండీ.అహ్మద్, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు ఉన్నారు.

ఫార్మర్ ఫస్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

సిద్దిపేటకమాన్: సంక్రాంతి రోజు తమ ఇంటి ముంగిట్లో చుక్కల ముగ్గు వేస్తూ ఒక నిమిషం వీడియోతో పాటు ముగ్గు పూర్తయ్యాక ముగ్గుతో పాటు ఒక సెల్ఫీ ఫొటోను తమ వాట్సాప్ నంబర్‌కు 7997707172 తమ చిరునామాతో పాటు పూర్తి వివరాలను పంపించాలని ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్ చక్రధర్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. అందమైన ముగ్గులను ఎంపిక చేసి ఆకర్షణీయమైన బహుమతులను అందజేస్తామన్నారు. నియోజకవర్గంలోని మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ తరఫున ముగ్గుల పోటీల్లో ఎంపికైన వారికి మొదటి బహుమతి గా రూ.51,111 నగదు, రెండో బహుమతిగా (ఇద్దరికి) రూ. 25,111 నగదు, మూడో బహుమతిగా (పది మందికి) రూ.11,111 నగదు, నాలుగో బహుమతిగా (ఇరువై మందికి) రూ.5,111 నగదుతో పాటు వందమంది మహిళలకు కన్సొలేషన్ బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు.

దుబ్బాక మండల మజీద్ కమిటీ అధ్యక్షుడిగా ఖలీల్



కార్యవర్గ సభ్యులు

దుబ్బాకటౌన్: దుబ్బాక మండల మజీద్ కమిటీ నూతన కార్యవర్గాన్ని మంగళవారం పట్టణంలోని జామా మజీద్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల మజీద్ కమిటీల అధ్యక్షుల ఆధ్వర్యంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా దుబ్బాకకు చెందిన మహమ్మద్ ఖలీల్, ఉపాధ్యక్షులుగా సలీం, షాదుల్, ప్రధాన కార్యదర్శిగా మక్బుల్, కార్యదర్శులుగా షాబొద్దీన్, షాదుల్, సహాయ కార్యదర్శిగా తాజొద్దీన్, క్యాషియర్‌గా జహంగీర్, గౌరవ సభ్యులుగా షరీఫ్, అబ్దుల్ సత్తార్, కౌసర్‌మియా, ఇస్మాయిల్, గౌరవ సలహాదారులుగా అల్తాఫ్, ఇర్ఫాన్, హాజీబాబాలను ఎన్నుకున్నారు.

భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని దాచారం శివారులో గల 124 సర్వే నంబర్‌లో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం జరిగేలా చూడాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం నాగరాజు తహసీల్దార్ విజయ ప్రకాశ్‌రావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం బెజ్జంకి ట్రాన్స్‌కో కార్యాలయంలో ఏఈని కలిసి విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమాలలో మండల అధ్యక్షుడు అశోక్, శ్రీనివాస్, సత్యనారాయణ, రవి, బాబు, శ్రీనివాస్, సుధాకర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ జెండా ఆవిష్కరణ

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని వెలికట్ట గ్రామంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అమ్ముల బాల్‌నర్సయ్య మాట్లాడుతూ.. కార్మికుల అనుకూలంగా ఉండే చట్టాలను కేంద్ర ప్రభుత్వం తొలగించే ప్రయత్నం చేస్తుండడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక పనితీరులను ఎండగట్టేందుకు జాతీయ మహాసభలు వేదికగా మారుతాయన్నారు. అఖిల భారత మహాసభలకు సూచికగా సీఐటీయూ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బర్ర కొమురయ్య, కనకయ్య, సాయిలు, నర్సింలు, పోశయ్య, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చేర్యాలలో హాస్టల్ ఏర్పాటు చేయాలి

మంత్రి హరీశ్‌రావుకు ఏఐఎస్‌బీ ఆధ్వర్యంలో వినతి



మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు వేణు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): చేర్యాల మండల కేంద్రంలో పోస్ట్ మాట్రిక్ వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్ బ్లాక్ (ఏఐఎస్‌బీ) ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పుల్లని వేణు మాట్లాడుతూ.. చేర్యాలలో సుమారు ఇరువై కళాశాలలు, పాఠశాలలు ఉన్నాయని, అందులో మూడువేలకుపైగా విద్యార్థులు దూర ప్రాంతాల నుంచి చదువు నిమిత్తం చేర్యాల పట్టణానికి రాకపోకలు కొనసాగిస్తున్నారన్నారు. రవాణా చార్జీలు చెల్లించలేక చదువు మధ్యలోనే ఆపేస్తున్నారని, వారికి హాస్టల్ వసతి ఉంటే చదువు కొనసాగిస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. జనగామ ఎమ్మెల్యే, మంత్రులు చొరవ తీసుకొని పోస్ట్ మాట్రిక్ హాస్టల్ ఏర్పాటు చేయాలన్నారు. వసతి గృహం ఏర్పాటుతో పేద విద్యార్థులకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు భోగి మనోహర్, అఖిల్, గుగులోతు రాహుల్, శివతేజ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన కార్యాలయం ఏర్పాటు చేయాలి

అక్కన్నపేట(హుస్నాబాద్): సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోనే గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో మంత్రి హరీశ్‌రావుకు లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మాలోతు సత్యంనాయక్, గిరిజన అభివృద్ధి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరన్ననాయక్, గిరిజన నాయకుడు అజ్మీర తిరుపతినాయక్‌లు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం సంగారెడ్డి జిల్లాలో ఉండడంతో గిరిజనులు అక్కడికి వెళ్లిరావడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఏదైనా లోన్ల సమస్యలపై సంగారెడ్డి జిల్లాకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని మంత్రికి వివరించినట్లు వారు తెలిపారు. అదేవిధంగా జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌కు కూడా ఈ విషయంపై వినతిపత్రాన్ని సైతం సమర్పించామన్నారు. తక్షణమే జిల్లా కలెక్టరేట్‌లో గిరిజన సంక్షేమ శాఖ, డీటీడీఓ కార్యాలయం సైతం ఏర్పాటు చేయాలని కోరినట్లు వారు పేర్కొన్నారు.

పదిలో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



ములుగులో విద్యార్థుల తల్లితండ్రులను కలిసిన ఉపాధ్యాయులు

ములుగు(గజ్వేల్): పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ములుగు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కసరత్తు మొదలుపెట్టారు. పరీక్షలు సమీపిస్తుండటంతో విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ములుగు ఉన్నత పాఠశాలలో మండలంలోని నర్సంపల్లి, మాసాన్‌పల్లి, లక్ష్మక్కపల్లి, నాగిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన 81 మంది విద్యార్థినీ, విద్యార్థులు పదోతరగతి చదువుతున్నారు. అయితే మరింత పట్టుదలతో, ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగే క్రమంలో ఉపాధ్యాయులు మంగళవారం బృందాలుగా విడిపోయి ఆయా గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. పిల్లలను ప్రతిరోజు ఉదయం 5గంటల నుంచి 7 గంటల వరకు, రాత్రి 7 గంటల నుంచి 10 గంటల వరకు చదివేలా ప్రత్యేక చొరవ చూపాలని తల్లిదండ్రులకు సూచించారు. విద్యార్థులకు ఇంటివద్ద సబ్జెక్టుల పరంగా ఎలాంటి సందేహాలు కలిగినా నేరుగా ఉపాధ్యాయులకు ఫోన్‌చేసి తెలుసుకోవాలని కోరారు. మరో మూడునెలలు కష్టపడి చదివితే తమపిల్లలు ఉత్తమ గ్రేడ్‌లో పాసవుతారని తల్లిదండ్రులకు వివరించారు. అదేవిధంగా ప్రతినెల మూడో శనివారం పాఠశాలలో నిర్వహించే తల్లిదండ్రుల సమావేశానికి విధిగా హాజరై విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి సహకరించాలని ఉపాధ్యాయులు తల్లితండ్రులను కోరారు. రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు తల్లితండ్రులను ఉద్దేశించి తమ పిల్లలు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు రూపొందించిన కరపత్రాలను ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లితండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమర్‌నాథ్‌రావు, భూజాత, నాగరాణి, జ్యోతి, శైలజ, వీణ, మధుమతి, అనిత, రవీందర్, సత్యవిజయ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి



ఇరుముడి పూజ నిర్వహిస్తున్న స్వాములు

చిన్నకోడూరు (సిద్దిపేట): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చౌడారంలో గ్రామ మాజీ సర్పంచ్ భూంరెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారణ భక్తులకు ఇరుముడి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియమనిష్ఠలకు, క్రమశిక్షణకు అయ్యప్ప మాలధారణ పెట్టింది పేరన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావులు తెలంగాణలో ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు కనకరాజు, సదానందంగౌడ్, రైతుబంధు జిల్లా డైరెక్టర్ వెంకటేశం, ప్రజాప్రతినిధులు, మాలధారణ భక్తులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలు బడిలోనే ఉండాలి



కొండపాక: అవగాహన కల్పిస్తున్న సీఆర్పీ సంతోష్

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని బొబ్బాయిపల్లి, రామునిపల్లి, ముద్దాపూర్ గ్రామాల శివారుల్లో గల పౌల్ట్రీఫామ్‌లలో పనిచేస్తూ బడిబయట ఉంటున్న పిల్లల సర్వేను విద్యాశాఖ ఆదేశాల మేరకు సీఆర్పీ పాల సంతోష్ ఆధ్వర్యంలో సర్వే చేశారు. ఈ సందర్భంగా పాల సంతోష్ మాట్లాడుతూ.. 6 నుంచి 14 సంవత్సరాలలోపు విద్యార్థులు తప్పకుండా బడిలోనే ఉండాలన్నారు. బడీడు పిల్లలు బడిలోనే ఉండేలా తల్లిదండ్రులతో పాటు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఇతర రాష్ట్రాల నుంచి బతుకుదెరువు కోసం వచ్చి కోళ్లఫామ్‌లలో పనిచేస్తున్న 10మంది బడి బయట పిల్లలను గుర్తించామన్నారు. చదువు ప్రాముఖ్యతపై తల్లిదండ్రులకు సంతోష్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక: 6–14 సంవత్సరలోపు వయస్సు గల పిల్లలు బడిలోనే ఉండేలా తల్లిదండ్రులు సహకరించాలని ఆర్‌ఐ భానుప్రకాశ్ కోరారు.రాయపోల్ మండలంలో సీఆర్పీ యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బడి బయట పిల్లలను బడిలో చేర్పించే కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో చదువు ఎంతో ముఖ్యమని, సమాజం అభివృద్ధి చెందాలంటే వందశాతం అక్షరాస్యత సాధించాలన్నారు. అలాగే దౌల్తాబాద్ మండలం సూరంపల్లి గ్రామంలో సీఆర్పీ రాజు ఆధ్వర్యంలో బడి బయట పిల్లలను బడిలో చేర్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు.

పాడి రైతులకు రుణాలు



రుణాల మంజూరు పత్రాన్ని అందిస్తున్న చైర్మన్ దేవేందర్‌రావు

కోహెడ(హుస్నాబాద్): కోహెడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో పాడి రైతులకు రుణాలు అందించారు. ఈ సందర్భంగా కోహెడ ఫ్యాక్స్ చైర్మన్ పెరియాల దేవేందర్‌రావు మాట్లాడుతూ.. ఆరెపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని చంద్రనాయక్ తండాకు చెందిన 18 మంది పాల ఉత్పత్తిదారులకు కరీంనగర్ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ట్రైపాడ్ అగ్రిమెంట్‌తో రూ.10 లక్షల 80 వేలు అందించామన్నారు. షీప్, మార్టిగేజ్ తదితర రుణాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రుణాలు అవసరం ఉన్న రైతులు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. రుణాలను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతుల ఆర్థిక ఎదుగుదలే లక్ష్యంగా ప్రోత్సాహక రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. క్రమం తప్పకుండా రుణాలు సకాలంలో చెల్లిస్తూ ఫ్యాక్స్ సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఈఓ ముంజ మల్లికార్జున్‌గౌడ్, డైరెక్టరు బానోతు బాలు, లకపతి, దేవేందర్, మోహన్ పాల్గొన్నారు.